సాక్షి ఖమ్మం

శనివారం । 20 । మే । 2023



ఏళ్ల తర్వాత కళ్లలో ఆనందం

వీఆర్‌ఏల సర్వీస్ క్రమబద్ధీకరణ, పే స్కేల్ అమలుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది.

8లో



ఉద్యోగాల పేరిట టోకరా

సింగరేణి సంస్థలో పర్మనెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి డబ్బులు వసూలు చేసిన విషయం బయటపడింది.

8లో



వాతావరణం

జిల్లా అంతటా శనివారం ఎండ ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'సాక్షి' ఆధ్వర్యంలో పోటీలు

- నేటి నుంచి మూడు రోజుల పాటు..

ఖమ్మం సహకారనగర్: సాక్షి మీడియా, రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ కాలనీ ఆధ్వర్యాన వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ నెల 20, 21, 22వ తేదీల్లో చదరంగం, చిత్రలేఖనం, కరాటేపోటీలు ఉంటాయి. ఖమ్మం శ్రీనగర్ కాలనీ రోడ్డు నంబర్ 9లోని రెజొనెన్స్ స్కూల్‌లో నిర్ణీత తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు పోటీలు నిర్వహిస్తారు. ఈనెల 20న 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు చదరంగం, 21న 5, 6, 7వ తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం, 22న 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు కరాటే పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎవరి సామగ్రి వారే తెచ్చుకోవాల్సి ఉంటుంది. వివరాలు, పేర్ల నమోదు కోసం 87123 44800, 88866 62271 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించండి



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ స్నేహలత

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటూ జీఓ 59 ద్వారా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారు నిర్ణీత ఫీజు చెల్లించాలని అదనపు కలెక్టర్ స్నేహలత సూచించారు. పట్టణంలోని జలగంనగర్, జవహర్‌నగర్ కాలనీల్లో దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం ఆమె అవగాహన కల్పించారు. అయితే, పలువురు కూలి పనులు చేస్తూ జీవనం తమకు రూ.లక్షల్లో ఫీజు చెల్లించే స్తోమత లేదని వాపోవారు. ఆతర్వాత వెంకటేశ్వరటాకీస్‌రోడ్డులో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, తామర చెరువు, వేశ్యకాంతల చెరువులను పరిశీలించి వచ్చేనెల 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా తామర చెరువు పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, ఆర్‌ఐ జానీమీయా పాల్గొన్నారు.

ప్రశాంతంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష

ఖమ్మం సహకారనగర్: డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నియామకాలకు శుక్రవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని అధికారులు వెల్లడించారు. జిల్లాలోని ఏడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు ఉదయం 1,481మందిలో 895మంది హాజరయ్యారని తెలిపారు. అలాగే, మధ్యాహ్నం పరీక్షకు 889మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

ఈనెల 23 నుండి సదరమ్ క్యాంపులు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో ఈనెల 23నుండి జూన్ 27వ తేదీ వరకు సదరమ్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. 23న మధిర నియోజకవర్గం, 30న సత్తుపల్లి నియోజకవర్గం, జూన్ 6న పాలేరు నియోజకవర్గం, 13న వైరా నియోజకవర్గం, 20న ఖమ్మం నియోజకవర్గం, 27న ముదిగొండ, సింగరేణి, కామేపల్లి మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే ఈ క్యాంపులకు హాజరయ్యే దివ్యాంగులు స్లాట్ రశీదు, ఆధార్ కార్డ్ జిరాక్స్, ఒక ఫొటో తీసుకు రావాలని సూచించారు.

వానలు పడేలోగా పెండింగ్ పనులు పూర్తి



ఇంజనీర్లతో సమీక్షిస్తున్న ఎస్‌ఈ శంకర్‌నాయక్

ఖమ్మంఅర్బన్: వానలు మొదలయ్యేలా లోగా పెండింగ్ పనులన్నీ పూర్తిచేయాలని జల వనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్ ఆదేశించారు. ఖమ్మంలోని కార్యాలయంలో జలవనరుల శాఖకు సంబంధించిన పనులపై డివిజన్ల వారీగా ఇంజనీర్లతో ఆయన శుక్రవారం సమీక్షించారు. ఈసందర్భంగా సీఈ మాట్లాడుతూ మరమ్మతు పనులన్నీ జూన్15 నాటికి పూర్తిచేయాలని స్పష్టం చేశారు. అలాగే, 2021–22లో మంజూరైన పనులన్నింటినీ ఇరవై రోజుల్లోగా పూర్తిచేయడంతో పాటు 2022–23 ఆర్థిక సంవత్సరం పనులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. రానున్న వ్యవసాయ సీజనల్‌లో సమస్యలు తలెత్తకుండా నీటి సరఫరా సాగేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం, కల్లూరు ఎస్‌ఈలు నర్సింగరావు, ఆనంద్‌కుమార్, డీసీఈ ధన్‌కుమార్‌రెడ్డి, ఈఈలు మంగళప్పుడి వెంకటేశ్వర్లు, అనన్య, బాబురావు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మక్కకు నిబంధనాలు



కొణిజర్లలో కల్లాల్లోనే ఉన్న మొక్కజొన్న

- ఇంకా ఊపందుకోని మొక్కజొన్న కొనుగోళ్లు
- పూర్తిగా ఏర్పాటు కాని కేంద్రాలు
- పలుచోట్ల ఆందోళనలకు దిగుతున్న రైతాంగం
- మరోపక్క దయనీయంగా కౌలు రైతుల పరిస్థితి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అకాల వర్షాలతో మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు పంట విక్రయాల్లోనూ అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో యాసంగిలో పండించిన మొక్కజొన్న సేకరణ కోసం మార్క్‌ఫెడ్ కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం జరగగా.. నిబంధనల కారణంగా పంట అమ్ముకోవడానికి రైతులు అవస్థ పడుతున్నారు. ఇక కౌలు రైతుల నుంచి మొక్కజొన్న సేకరించకపోవడంతో పలుచోట్ల ఆందోళనలకు దిగుతున్నారు. ఈనెలాఖరులోగా లక్ష్యం మేరకు మొక్కజొన్న కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగడం లేదు.

యాసంగిలో అత్యధికంగా..

ఈ యాసంగి సీజన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతులు అత్యధికంగా మొక్కజొన్నను సాగు చేశారు. గత ఏడాది పత్తి దెబ్బతినడంతో మొక్కజొన్నకు ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే, వరి కోసిన తర్వాత యాసంగి పంటగా మొక్కజొన్ననే ఎంచుకున్నారు. ఇలా ఖమ్మం జిల్లాలో 91,225 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 28,290 ఎకరాల్లో పంట సాగైంది. అయితే పంట దశ, కోత, ఆ తర్వాత అకాల వర్షాలతో పలుచోట్ల దెబ్బతిని దిగుబడి తగ్గింది.

ఆలస్యంగా కేంద్రాలు..

ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాకు రూ.1,962 మద్దతు ధర ప్రకటించినా కొనుగోలు కేంద్రాలను మాత్రం ఏర్పాటుచేయలేదు. దీంతో వ్యాపారులు రూ.1,500 నుంచి రూ.1600 వరకే కొనుగోలు చేశారు. ఆతర్వాత మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లకు ఆదేశించిన ప్రభుత్వం ఖమ్మం జిల్లాలో 44 కేంద్రాల ద్వారా 60 వేల మెట్రిక్ టన్నులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 11 కేంద్రాల ద్వారా 19,080 మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 34 కేంద్రాలే ప్రారంభం కాగా 7,200 మెట్రిక్ టన్నులు, భద్రాద్రి కొత్తగూడెంలో తొమ్మిది కేంద్రాలు ప్రారంభించి 700 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

నిబంధనలతో ఆగమాగం

మార్క్‌ఫెడ్ నిబంధనలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎకరానికి 26.20 క్వింటాళ్ల దిగుబడే తీసుకుంటామని చెప్పడంతో మిగతా పంట ఎక్కడ అమ్ముకోవాలో తెలియక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. అలాగే, పత్తి సాగు చేసిన సమయంలో ఏఈఓలు నమోదు చేశాక, ఆ పంట దెబ్బతినడంతో మొక్కజొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక అకాల వర్షాలతో పంట దెబ్బతినగా తేమ ఎక్కువగా ఉందనే నెపంతో సేకరణకు నిరాకరిస్తున్నారు. మరోపక్క పంట భూమి కలిగిన రైతుల నుంచే కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్‌ను ప్రభుత్వం ఆదేశించించగా కౌలు రైతులకు దిక్కు తోచడం లేదు. ఈ నిబంధనకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి లేఖ రాసినా ఇంకా స్పందన రాలేదు. ఇప్పటికే పంట చేతికి వచ్చి నెల గడవగా వానాకాలం సీజన్ వస్తుండటంతో పంట దెబ్బతింటుందనే భయంతో రైతులు ధర్నాలకు దిగుతున్నారు. కాగా, తిరుమలాయపాలెం మండలంలో 540 మంది రైతులు 885 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, పాలేరు నియోజకవర్గంలోని జీళ్లచెరువులో మాత్రమే కొనుగోలు కేంద్రం ఏర్పాటైంది. దీంతో రైతులు శుక్రవారం ధర్నా చేశారు.



తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు క్రాస్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

కూపన్లకు తంటాలు..



ఈ రైతు పేరు బీరెల్లి భద్రయ్య. కొణిజర్ల మండలం బొట్లకుంటకు చెందిన ఈయన 15 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఎకరానికి రూ.30 వేలు చొప్పున దాదాపు రూ 4.50 లక్షల ఖర్చు రాగా, 570 క్వింటాళ్ల పండిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి వెళ్లాక సమస్య మొదలైంది. మొత్తం సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో 375 క్వింటాళ్లకే కూపన్లు ఇచ్చారు. దీంతో మిగతా పంట అమ్ముకునేందుకు ఇతర రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు సమర్పించి కూపన్లు తీసుకుంటున్నాడు. కానీ ప్రభుత్వం చెల్లించే డబ్బులు సదరు రైతుల ఖాతాలో పడనుండడంతో వారి ఇళ్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

గోనె సంచులు లేవు..



250 క్వింటాళ్ల మొక్కజొన్నలు తీసుకొచ్చి నాలుగు రోజులైనా గోనె సంచులు లేక కొనుగోలు చేయలేదు. అలాగే, ఎకరాకు 26 క్వింటాళ్లే తీసుకుంటామని చెప్పారు. డబ్బులు కూడా పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న రైతు ఖాతాలోనే జమ చేస్తారట. ఇదంతా చూస్తుంటే తక్కువ ధరకు వ్యాపారులకే అమ్ముకోవడం మంచిదనిపిస్తోంది.

– చావా నాగేశ్వరరావు, రాయన్నపేట, బోనకల్ మండలం

కొనుగోళ్లు వేగిరం చేస్తున్నాం



అవసరమైన మేరకు, పంట సాగు చేసిన జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఆయా చోట్ల కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నాం. ఇప్పటికే ఖమ్మంలో 34 కేంద్రాలు, భద్రాద్రి కొత్తగూడెంలో తొమ్మిది ప్రారంభమయ్యాయి. కౌలు రైతుల విషయాన్ని పరిశీలించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– సునీత, మార్క్‌ఫెడ్ మేనేజర్, ఉమ్మడి జిల్లా

రద్దు.. మంచిదే!



- రూ.2వేల నోట్లను రద్దు చేస్తూ ఆర్‌బీఐ ప్రకటన
- నిర్ణయాన్ని స్వాగతించిన జిల్లా వాసులు

ఖమ్మంవ్యవసాయం: మరోసారి పెద్ద నోటు రద్దయింది. రూ.2 వేల నోట్లను రద్దు చేస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) శుక్రవారం ప్రకటించింది. నల్లధనంతో పాటు అక్రమ నిల్వలను అరికట్టడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. 2016 నవంబర్ 8వ తేదీన రూ.వెయ్యి, రూ.500 నోట్లను రద్దు చేయగా.. ఆయా నోట్లు కలిగి ఉన్న వారు బ్యాంకుల్లో డిపాజిట్ చేయడం, మార్చుకోవడానికి ఆర్‌బీఐ అప్పట్లో అవకాశం కల్పించింది. ఆతర్వాత రూ. వెయ్యి నోట్లను పూర్తి రద్దు చేయగా రూ.2వేలతో పాటు రూ.500 నోట్లను కొత్తగా విడుదల చేసింది. అయితే, రానురాను రూ.2వేల నోట్ల చెలామణీ తగ్గి బడా వ్యాపారులు, పారిశ్రామికవేత్తల ఖజానాల్లో నల్లధనంగా మూలుగుతున్నాయనే ప్రచారం మొదలైంది. ఈనేపథ్యాన రూ.2వేల నోట్లను రద్దు చేస్తూ నిర్ణయం వెలువరించారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు జిల్లాలోని బ్యాంకుల్లో రూ.2 వేల నోట్లు కలిగిన వారు సెప్టెంబర్ 30వ తేదీ వరకు డిపాజిట్ చేసుకోవచ్చు. ఒక దఫాలో ఒక్కొక్కరు రూ.20 వేల వరకు అంటే పది రూ.2వేల నోట్లను ఒకసారి డిపాజిట్ చేసుకునే అవకాశం కల్పించగా.. ఈనెల 23వ తేదీ నుంచి ప్రక్రియ మొదలుకానుంది. కాగా, నోట్ల రద్దు నిర్ణయంపై జిల్లా వాసులు పలువురి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

రూ.2 వేల నోటు రద్దు హర్షణీయం



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంచి నిర్ణయం తీసుకుంది. రూ.2 వేల నోట్ల రద్దు ఆహ్వానించదగిన పరిణామం. డిజిటలైజేషన్, ఆన్‌లైన్ విధానం అమలవుతున్న నేపథ్యాన నోట్లను రద్దు చేయడమే మంచిది. సామాన్య, మధ్య తరగతి వర్గాల వద్ద ఇప్పటికే ఈ నోట్లు రొటేషన్‌లో లేవు.

– చిన్ని కృష్ణారావు, అధ్యక్షుడు, చాంబర్ ఆఫ్ కామర్స్

రూ.వెయ్యి నోట్లు తీసుకొస్తే మంచిది



ఆర్థికంగా పెద్దల వద్ద లాకర్లలోనే రూ.2వేల నోట్లు ఉన్నాయే తప్ప పేద, మధ్య తరగతి వర్గాల వద్ద అంతగా లేవు. అందుకే రూ.2 వేల నోట్ల రద్దు అభినందించదగిన అంశం. ఆ నోట్ల స్థానంలో రూ.వెయ్యి నోట్లను తీసుకువస్తే అన్నివర్గాల ప్రజలకు కొంత ప్రయోజనంగా ఉంటుంది.

– వుల్లిబోయిన సైదులు, కార్యదర్శి, టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్

నల్లధనాన్ని అరికట్టడానికి దోహదం



రూ.2వేల నోట్ల రద్దు నిర్ణయంతో నల్లధనాన్ని అరికట్టడం సాధ్యమవుతుంది. బడా వ్యాపారులు, పారిశ్రామిక వేత్తల వద్ద ఉన్న నల్లధనం బయటకు వచ్చే అవకాశం ఉంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు ఈ పరిణామం ప్రయోజనం కలిగించేదే.

– రుద్రాక్షి మల్లేశం, కార్యదర్శి, ఖమ్మం వ్యవసాయ మార్కెట్

ఎన్నికల వేళ మంచి పరిణామం



నోట్ల రద్దు రానున్న ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉంది. బడా బాబుల వద్ద ఉన్న రూ.2వేల నోట్ల రూపంలో ఉన్న నల్లధనం బ్యాంకులకు చేరి రికార్డులకు ఎక్కుతుంది. తద్వారా ఎన్నికల్లో డబ్బు ప్రభావం తగ్గే అవకాశం ఉంది. ఆర్‌బీఐ నిర్ణయం కోసం చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్నాం.

– మిర్యాల విక్రమ్‌రెడ్డి, బీరోలు, తిరుమలాయపాలెం మండలం

కనికరించని సూరీడు

ఖమ్మంవ్యవసాయం: ఎండలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సూర్యుడు ఏ మాత్రం కనికరించకుండా తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం నుంచే మొదలవుతున్న ఎండకు వడగాలులు తోడవుతుండడంతో పిల్లలు, వృద్ధులు నీరసపడిపోతున్నారు. ఉష్ణోగ్రత పెరగడంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లడానికి ప్రజలు వెనకాడుతున్నారు. జిల్లాలో శుక్రవారం 40–44.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా నేలకొండపల్లి మండల కేంద్రంలో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారిక గణాంకాల ద్వారా వెల్లడైంది. ఇంకా ముదిగొండ మండలం పమ్మి, బాణాపురంల్లో 44, చింతకానిలో 43.7, తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 43.5, ముదిగొండలో 43.1, కూసుమంచిలో 42.9, చింతకాని మండలం నాగులవంచ 42.7, ఏన్కూరు మండలం తిమ్మారావుపేటలో 42.3, ఖమ్మం ఎన్నెస్పీ గెస్ట్ హౌస్ వద్ద 42.2, బోనకల్ మండలం రావినూతలలో 42.2, మధిరలో 42.2, కొణిజర్ల మండలం పెదగోపతిలో 42.0, ఖమ్మం ఖానాపురంలో 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

జాబ్ మేళాకు 14వేల మంది రిజిస్ట్రేషన్

వెల్లడించిన సీపీ విష్ణు ఎస్.వారియర్

ఖమ్మంమయూరిసెంటర్: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహించనుండగా 140కంపెనీల బాధ్యులు పాల్గొని 8,150మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారని ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాల ప్రాంగణంలో జాబ్‌మేళా జరుగుతుందని, ఇప్పటివరకు 14 వేల మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. ఖమ్మం, వరంగల్, విజయవాడ, హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల నుండి 140 కంపెనీల బాధ్యులు హాజరై ఫార్మా, మెడికల్, ఐటీ కంపెనీలతో పాటు బ్యాంకింగ్, సర్వీసెస్, ఎడ్యుకేషన్ రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఎస్సెస్సీ మొదలు ఇంటర్, డిగ్రీ, ఇతర వృత్తివిద్యా కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులని, మొత్తంగా 8వేల మందికి పైగా అవకాశం లభించే అవకాశముందని చెప్పారు. కాగా, జాబ్‌మేళా సందర్భంగా అభ్యర్థులు, కంపెనీల ప్రతినిధుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. అభ్యర్థులు కనీసం పది సెట్ల బయోడేటాలు తీసుకొస్తే రెండు, మూడు కంపెనీల ఇంటర్వ్యూకు హాజరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళాలో కనీసం 5వేల మంది ఉద్యోగాలకు ఎంపికైనా రికార్డు సృష్టించినట్లవుతుందని సీపీ చెప్పారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు గణేష్, బస్వారెడ్డి, రామోజీ రమేష్, రెహమాన్, ప్రసన్నకుమార్, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, సీఐ తుమ్మ గోపి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, పక్కన అధికారులు

మెడికల్ కాలేజీకి 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను కేటాయించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో వీరిని ఖమ్మం కళాశాలకు కేటాయించగా, 22వ తేదీన అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. కొన్నాళ్ల క్రితం జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కాగా, రానున్న విద్యాసంవత్సరం నుంచే తరగతుల నిర్వహణకు అనుమతి లభించింది. ఈ నేపథ్యాన భవనాలను అధికారులు సిద్ధం చేస్తుండగా.. నియామకాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే ఇద్దరు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 23మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులను నియమించారు. వీరికి తోడు 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధుల్లో చేరనున్నారు.

రేపు బీజేపీ నిరుద్యోగ మార్చ్

ఖమ్మం మామిళ్లగూడెం: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడంతో పాటు మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలనే డిమాండ్లతో ఖమ్మంలో ఆదివారం నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. ఈమేరకు ఖమ్మంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ మార్చ్‌కు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో పాటు ఇతర ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. నిరుద్యోగ యువత, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, కోనేరు చిన్ని, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, ఉప్పల శారద, రవీంద్రనాయక్, కాసం వెంకటేశ్వర్లు, రమేష్, రుద్ర ప్రదీప్, నున్నా రవికుమార్, శ్యాం రాథోడ్, వాసుదేవరావు, నంబూరి రామలింగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నాయకులు

మున్సిపాలిటీల్లో ట్రిపుల్ ఆర్..

- నేటి నుంచి 'మేరీ లైఫ్.. మేరీ స్వచ్ఛ షెహర్'
- పనికిరాని వస్తువుల సేకరణకు కేంద్రాలు
- కేంద్ర, రాష్ట్రస్థాయిల్లో అవార్డులు సాధించేలా కసరత్తు
- ప్రతీచోట ఓ చెరువు పరిశుభ్రతపై దృష్టి

సత్తుపల్లిటౌన్: నగరాలు, పట్టణాల్లో స్వచ్ఛత కోసం కేంద్ర ప్రభుత్వం 'మేరీ లైఫ్.. మేరీ స్వచ్ఛ షెహర్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈనెల 20వ తేదీ శనివారం నుంచి జూన్ 5వ తేదీ వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు సత్తుపల్లి, మధిర, వైరా, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీల్లో మేరీ మిషన్ లైఫ్ పేరిట ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. అందుకోసం మున్సిపల్ యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది.

ట్రిపుల్ ఆర్ కేంద్రాలు

రీయూజ్ (మళ్లీ ఉపయోగించడం), రీసైకిల్ (మళ్లీ ఉత్పత్తి చేయటం), రెడ్యూస్ (తగ్గించడం) విధానంతో ట్రిపుల్ ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వార్డులు, కాలనీల వారీగా వీటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వెంగళరావునగర్ కమ్యూనిటీ హాల్, ఎన్టీఆర్ నగర్ కమ్యూనిటీ హాల్, గుడిపాడు స్కూల్, పాత సెంటర్ స్కూల్, కల్పతరు రోడ్డు స్కూల్, వేంసూరు రోడ్లలో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయం

సేకరించే వస్తువులు..

స్వయం సహాయక సంఘాల సభ్యులు పదిహేను రోజుల పాటు ప్రతిరోజు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ట్రిపుల్ ఆర్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలు చేస్తారు. అలాగే, పర్యవేక్షణ కోసం వార్డు అధికారులను ప్రత్యేకంగా సేకరణకు నియమించారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, చెప్పులు, వాటర్ బాటిళ్లు, పుస్తకాలు, నోట్‌పుస్తకాలు.. తదితర వస్తువులను ఈ కేంద్రాల్లో సేకరిస్తారు. ఇంటి యజమానులే స్వయంగా కేంద్రాలకు వెళ్లి వీటిని అందించాల్సి ఉంటుంది.

కేంద్ర, రాష్ట్రస్థాయిల్లో అవార్డులు

ట్రిపుల్ ఆర్ కేంద్రాల ద్వారా అత్యధికంగా వస్తువులు సేకరించిన మున్సిపాలిటీలకు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అవార్డులను కేంద్ర ప్రభుత్వం అందించనుంది. అదేవిధంగా మున్సిపల్ స్థాయిలో ఏ కేంద్రంలో వస్తువులను ఎక్కువగా సేకరిస్తారో ఆ కేంద్రానికి కూడా అవార్డులు ఇస్తారు. అంతేకాక పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ మున్సిపాలిటీలో ఓ చెరువులో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయించనున్నారు.

అందరూ బాధ్యతగా భావించాలి..



ఇళ్లు, పరిసరాల్లో వృథాగా, నిరుపయోగంగా ఉన్న వస్తువులను ట్రిపుల్ ఆర్ కేంద్రాల్లో అందించాలి. దీనిని పౌరులందరూ బాధ్యతగా భావించాలి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సహకరిస్తే కార్యక్రమం విజయవంతమవుతుంది. తద్వారా అవార్డులు కూడా లభిస్తాయి.

–కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

క్లుప్తంగా

కోర్టు అనుమతితో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న దొడ్డా రవి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై కోర్టు అనుమతితో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీనే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు యత్నిస్తున్నామని నిర్వాహకులు దొడ్డా రవి తెలిపారు. లకారం ట్యాంక్‌బండ్‌పై శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు ఆలోచన నాలుగేళ్ల క్రితం రాగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి ఆయనతో పాటు ఎన్ఆర్ఐలు, కుల, మతాలకు అతీతంగా పలువురి చేయూతతో విగ్రహాన్ని సిద్ధం చేయించామన్నారు. అయితే, విగ్రహ రూపంపై ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమించాలని కోరారు. నిజామాబాద్‌కు చెందిన శిల్పి ప్రతాప్‌వర్మ విగ్రహాన్ని అద్భుతంగా తయారు చేశారని, అవసరమైన మెటల్‌ను చైనా నుండి దిగుమతి చేసుకున్నారని తెలిపారు. కాగా, విగ్రహం నుంచి పిల్లన గ్రోవి, నెమలి పింఛం, కిరీటం వెనుక చక్రం తొలగించగా, చేతిలో కత్తిని పెట్టనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు కర్నాటి కృష్ణ, కూరాకుల వలరాజు, పసుమర్తి రామోహన్‌రావు, డోన్‌వాన్ రవి, బత్తినేని నాగప్రసాద్, రావూరి సైదబాబు, బిక్కసాని జస్వంత్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హబ్‌కు గుర్తింపు.. అదృష్టం



కేక్ కట్ చేస్తున్న అధికారులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా పెద్దాస్పత్రిలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌కు గుర్తింపు దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. హబ్‌కు జాతీయ స్థాయిలో అక్రిడిటేషన్ వచ్చిన సందర్భంగా శుక్రవారం అధికారులు, సిబ్బంది కేక్ కట్ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇప్పటి వరకు హబ్ ద్వారా 1.54లక్షల మంది నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేసినట్లు తెలిపారు. నాణ్యతతో కూడిన సేవలందిస్తుండడంతో అక్రిడిటేషన్ సర్టిఫికెట్ మంజూరైందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఆర్ఎంఓలు డాక్టర్ బి.శ్రీనివాసరావు, డాక్టర్ అమర్‌సింగ్, పాథాలజిస్టులు బాలు, సందీప్, అశోక్ రెడ్డి, నందగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైరింగ్ సెంటర్ పరిశీలన



సెంటర్‌లో పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, అధికారులు

కారేపల్లి: మండలంలోని విశ్వనాథపల్లి గ్రామ సమాఖ్య ఆధ్వర్యాన వ్యవసాయ పనిముట్లతో ఏర్పాటుచేసిన హైరింగ్ సెంటర్‌ను అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయ పనిముట్లను రైతులకు అద్దెకు ఇస్తూ విశ్వనాథపల్లి గ్రామ సమాఖ్య లాభాల్లో నడుస్తుండడంపై అభినందించిన ఆమె వివరాలు తెలుసుకున్నారు. ఆతర్వాత నర్సరీ, పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. డీపీఎం రేవతి, ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచ్ ఇందిరాజ్యోతితో పాటు వడ్డె అజయ్‌బాబు, వడ్డె మాధవి, తుమ్మలపల్లి అనిల్, ఆర్.శ్రీను, చంద్రశేఖర్, సోందు, సీమశ్రీ, బి.వసంత, కళ్యాణి, సింధూజ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులు



నేలకొండపల్లిలోని వెంచర్లలో బోర్డు ఏర్పాటుచేస్తున్న ఉద్యోగులు

నేలకొండపల్లి: రియల్టర్ల ఇష్టారాజ్యానికి అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. మండలకేంద్రంలో పుట్టగొడుగులుగా వెలసిన అక్రమ వెంచర్లపై స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. మండలం మీదుగా జాతీయ రహదారి వెళ్తుండడంతో భూముల ధరలకు రెక్కలు రాగా, రియల్టర్లు నిబంధనలు ఉల్లంఘించి వెంచర్లు ఏర్పాటు చేశారు. ఈ విషయమై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవటంతో ఆర్‌టీఐ కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్, తదితరులు నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో అధికారులు శుక్రవారం పలు వెంచర్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడమే కాక ఆయా వెంచర్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన 15 మందికి నోటీసులు జారీ చేశారు. ఈ విషయం పై ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ దారా ప్రసాద్ మాట్లాడుతూ అనుమతి లేకుండా వెంచర్లను ఏర్పాటు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఏళ్ల తర్వాత కళ్లలో ఆనందం

- వీఆర్ఏల రెగ్యులరైజేషన్‌పై కేబినెట్ భేటీలో నిర్ణయం
- తద్వారా ఉద్యోగ భద్రత, పెరగనున్న వేతనం
- జిల్లాలో 650మందికి లబ్ధి



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏల జేఏసీ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: తాజాగా జరిగిన కేబినెట్ భేటీలో వీఆర్ఏల సర్వీస్‌ను క్రమబద్ధీకరించి పే స్కేల్ వర్తింపచేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో వీఆర్ఏల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని 21మండలాలు, 379 రెవెన్యూ గ్రామాల పరిధిలో 650మంది వీఆర్ఏలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో వారసత్వంగా వస్తున్న వారు 450మంది ఉండగా, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన 200మంది ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరికి లబ్ధి చేకూరనుంది.

పట్టుగొమ్మలు

వీఆర్వో వ్యవస్థ రద్దయ్యాక గ్రామస్థాయిలో రెవెన్యూ పరంగా ఏ పని కావాలన్నా గుర్తొచ్చేది వీఆర్ఏలే. అయినా అరకొర వేతనాలతో కాలం వెళ్లదీస్తుండగా సీఎం తీసుకున్న నిర్ణయంతో వారిలో ఆనందం వెల్లువెత్తుతోంది. ఇన్నాళ్లు ఉద్యోగ భద్రత లేకున్నా విధులు నిర్వర్తిస్తున్న వీరికి ప్రభుత్వం నిర్ణయంతో లబ్ధి జరగనుంది. కాగా, వీఆర్ఏలు తమ సమస్యలను పరిష్కరించాలని ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. 2016, 2022వ సంవత్సరాల్లో సుమారు నెల పాటు ఆందోళనలు చేపట్టారు. సర్వీస్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు పే స్కేల్ ఇవ్వాలని, అర్హులకు పదోన్నతి కల్పించాలనే డిమాండ్‌తో ఉద్యమిస్తుండగా సీఎం కేసీఆర్ ప్రకటించిన నిర్ణయంతో వీరి కల నెరవేరినట్లవుతోంది.

మూడు శాఖల్లోనే సర్దుబాటు

ఇదిలా ఉండగా రెగ్యులర్ అయ్యాక వీఆర్ఏలను వివిధ శాఖలకు కేటాయించనున్నారు. శాఖల ఎంపికలో వీఆర్ఏలకే అవకాశం ఇస్తారని సమాచారం. ప్రధానంగా ఇరిగేషన్ శాఖలో లష్కర్లుగానే కాక మున్సిపాలిటీ, వ్యవసాయ శాఖలకు కేటాయిస్తారనే తెలుస్తోంది. ఇక ఆసక్తి కలిగిన కొందరిని వీఆర్ఏలుగా కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఏదిఏమైనా ప్రభుత్వం మాత్రం వచ్చేనెల 20వ తేదీలోగా వీరందరిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేయాలనే నిర్ణయంలో ఉన్నట్లు సమాచారం

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

వీఆర్ఏలను రెగ్యులర్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ కేబినెట్ భేటీలో ప్రకటించడంపై వీఆర్ఏల జేఏసీ బాధ్యులు హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు శుక్రవారం కమ్మం జెడ్పీ సెంటర్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశాక సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా లింగరాజు మాట్లాడారు. వీఆర్ఏలను రెగ్యులర్ చేయడమే కాక పేస్కేల్ అమలు చేస్తామని చెప్పటం ఆనందంగా ఉందని తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెబోయిన నాగరాజుతో పాటు రమాదేవి, అమరం రాము, మరీదు వెంకటేశ్వర్లు, ఉపేందర్, చందూమియా, ప్రగతి, సత్య, సునీత, జ్యోతి, అజయ్, వీరయ్య, ఉపేందర్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

భద్రతతో పాటు వేతనం పెరుగుతుంది



ఇప్పటివరకు ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నాం. సీఎం ప్రకటనతో సర్వీస్ రెగ్యులర్ కావడమే కాక పేస్కేల్ వర్తిస్తే రూ.10,500 వేతనం రూ.25వేలకు చేరుతుంది. మాకు జూనియర్ అసిస్టెంట్ కేడర్ కేటాయిస్తే బాగుంటుంది. – చల్లా లింగరాజు, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆనందంగా ఉంది



సీఎం కేసీఆర్ మమ్మల్ని రెగ్యులర్ చేస్తూ పేస్కేల్ ఇస్తామని ప్రకటించటం ఆనందంగా ఉంది. త్వరగా కార్యాచరణ అమలుచేయాలి. ప్రభుత్వ పథకాల అమలుకు కృషి చేస్తున్న మేం ఇక నుంచి మరింత మెరుగైన సేవలందిస్తాం. – ఉప్పు రమాదేవి, మహిళా విభాగం అధ్యక్షురాలు

ప్రభుత్వ నిర్ణయంతో సంతోషం



వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తామనటం సంతోషంగా ఉంది. సంవత్సరాలుగా చేస్తున్న పోరాటంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అయితే, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు తక్షణమే ఇవ్వాలని కోరుతున్నాం. – అమరం రాము, వీఆర్ఏ, కోయచలక

సింగరేణి ఉద్యోగాల పేరిట టోకరా..

- రూ.50 లక్షల మేర వసూళ్లు
- కొందరికి నకిలీ పత్రాలు ఇచ్చి పని చేయించిన వైనం
- అక్రమార్కుడి దూతను పోలీసులకు అప్పగించిన బాధితులు



మధ్యవర్తిని (సర్కిల్‌లోని) నిలదీస్తున్న బాధితులు

సత్తుపల్లి: సింగరేణి సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సుమారు రూ.50లక్షలకు పైగా వసూలు చేసిన వ్యక్తి అక్రమాలు వెలుగుచూశాయి. ఒక్కొక్కరి నుంచి రూ.25 వేలు మొదలు రూ.5లక్షల వరకు దండుకున్నట్లు సమాచారం. ఈమేరకు ఆయన అక్రమాలు బయటపడడంతో బాధితులు శుక్రవారం సత్తుపల్లికి పిలిపించి పోలీసులకు పట్టించాలని భావించగా సదరు వ్యక్తి తన దూతను పంపించడంతో పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెంకు చెందిన శరత్‌చంద్ర సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో క్యాంటీన్, బెల్ట్ క్లీనింగ్, సీహెచ్‌పీ(కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్)లో సబ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. దినసరి కూలీలుగా ఇక్కడ 50 మందికి అవకాశం ఉండడంతో బీటెక్, డిగ్రీ, డిప్లొమా చేసిన నిరుద్యోగులకు సింగరేణి సంస్థలో పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికాడు. ఈమేరకు సత్తుపల్లి, కల్లూరు, మధిర, వైరా, కొత్తగూడెం ప్రాంతాలకు చెందిన వారి నుంచి కొందరు ఏజెంట్ల ద్వారా రూ.లక్షల్లో వసూలు చేశారు. సత్తుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భద్రం ద్వారా తాళ్లమడకు చెందిన కొందరి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆ గ్రామానికి చెందిన బీజాన్‌బీ తదితరులు వెల్లడించారు. కాగా, సింగరేణి సంస్థలో ఉద్యోగం వస్తుందనే భావనతో పలువురు ఇళ్ల స్థలాలు, పొలాలు అమ్మి డబ్బులు కట్టినట్లు సమాచారం.

అనుమానంతో ఆరా

కొందరికి ఉద్యోగాలు వచ్చినట్లు నకిలీ పత్రాలు ఇచ్చిన శరత్‌చంద్ర వారితో పని చేయించుకుంటున్నారు. కానీ ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అనుమానం వచ్చిన వీరు ప్రశ్నిస్తే తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో కొందరికి అనుమానం రాగా.. శరత్‌చంద్రకు ఫోన్ చేసి మరో ఇద్దరికి ఉద్యోగాలు కావాలి, డబ్బులు తీసుకునేందుకు సత్తుపల్లి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు రావాలని సూచించారు. అయితే, శరత్‌చంద్ర తన వద్ద పనిచేసే రుద్రంపూర్‌కు చెందిన ఎ.హరీశ్ పంపించాడు. అప్పటికే వల వేసి ఉన్న బాధితులు శరత్‌చంద్ర వస్తేనే హరీశ్‌ను వదిలిపెడతామని చెప్పగా గంటలోగా చేరుకుని డబ్బులన్నీ ఇస్తాను, గొడవ చేయండి అంటూ చెప్పాడు. కానీ రెండు, మూడు గంటలు దాటినా రాకపోవడంతో బాధితులంతా కలిసి హరీష్‌ను సత్తుపల్లి ఎస్సై బి.రాముకు అప్పగించారు. ఈ విషయమై సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో నియామకాలన్నీ పారదర్శకంగా జరుగుతాయని స్పష్టం చేశారు. ఎవరు కూడా దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కాగా, కొత్తగూడెంకు చెందిన సూర్య కన్‌స్ట్రక్షన్స్‌కు సీఎస్పీ కాంట్రాక్టు మరో నెల మాత్రమే ఉందని, సబ్ కాంట్రాక్టర్ల వ్యవహారంతో సంస్థకు సంబంధం లేదని చెప్పారు. ఇదే విషయమై సత్తుపల్లి సీఐ టి.కరుణాకర్ మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగాల పేరుతో జరిగిన అక్రమ లావాదేవీలపై విచారణ చేస్తున్నామని తెలిపారు. బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఉత్తుత్తి పత్రాలు..

సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని శరత్‌చంద్ర డబ్బు వసూళ్లు చేశాక ఆరు నెలల నుంచి కిష్టారం ఓసీ, కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ చుట్టూ తిప్పుకుంటున్నారని గజ్జల రాము, జుంజూరు గోపాలరావు, కొంపల్లి ప్రభాకర్‌రావు తదితరులు ఆరోపించారు. కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో రీడింగ్ తీయడం, కన్వేయర్ బెల్ట్ వద్ద పనులతో పాటు మెడికల్ ఫిట్‌నెస్ వర్క్, డంపర్ వద్ద వివరాల నమోదు ఉద్యోగాల పేరిట కొందరు నకిలీ నియామక పత్రాలు ఇచ్చి పని కూడా చేయించుకున్నాడని తెలిపారు.

ముందస్తు పంట కాలంపై సన్నద్ధత

రైతులతో సమావేశమైన శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రఘురామిరెడ్డి

వైరా: మారుతున్న పరిస్థితుల నేపథ్యాన పంటలు ముందుగా సాగు చేయాల్సిన అంశంపై రైతులకు అవగాహన కల్పించేందుకు శాస్త్రవేత్తలు, అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు వరి సాగు, వరిలో నూతన వంగడాలపై వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రైతులతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ వరి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్, మేనెలల్లో ఈదురుగాలులు, అకాల వర్షాల నుంచి రైతులు బయటపడాలంటే ముందస్తుగా సాగు చేయడం ఉత్తమమని తెలిపారు. అందుకోసం అందుబాటులో ఉన్న వరి వంగడాల వివరాలు వెల్లడించారు. అనంతరం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ మాసాంతానికి వానాకాలం వరి పంట ముగించుకుని రైతులు నవంబర్‌లో యాసంగి వరి సాగు చేస్తే అకాల వర్షాలు, ఈదురు గాలుల బారి నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల, వరి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.క్రిస్టోఫర్, వరంగల్ ప్రాంతీయ పరిశోధనా స్థానం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు డాక్టర్ దామోదర్‌రాజు, టి.రాణాప్రతాప్, డాక్టర్ జె.హేమంతకుమార్, డాక్టర్ జెస్సీ సునీత, డాక్టర్ కె.రవికుమార్, డాక్టర్ వి.చైతన్య, డాక్టర్ ఫణిశ్రీ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ సతీశ్‌చంద్ర, డాక్టర్ టి.కిరణ్‌బాబు పాల్గొన్నారు.

షిర్డీ యాత్రకు చింతగుర్తి వాసులు

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తి మాజీ సర్పంచ్ తమ్మిన్ని నాగేశ్వరరావు సొంత ఖర్చులతో గ్రామస్తులను షిర్డీ యాత్రకు తీసుకెళ్తున్నారు. ఈమేరకు 650 మందితో శనివారం షిర్డీ బయలుదేరనున్నారు. ఇందులో 350 మందిని ఖమ్మంలో గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ తీసుకెళ్లి అక్కడ నుండి అజంతా ఎక్స్‌ప్రెస్‌లో, మిగతా వారిని షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లో తీసుకెళ్తుండగా అందరికీ అక్కడ వసతి, తిరుగు ప్రయాణం టికెట్లు బుక్ చేసినట్లు నాగేశ్వరరావు తెలిపారు. కాగా, వీరి యాత్రను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం రైల్వేస్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభిస్తారని వెల్లడించారు.

జాతీయ గిరిజన ఆర్చరీ టోర్నీకి నలుగురి ఎంపిక



క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: జాతీయస్థాయి గిరిజన ఆర్చరీ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. జన జాతీయ ఖేల్ మహోత్సవం–2023 పోటీలు వచ్చే నెల 9 నుంచి 12 వరకు ఒడిషా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్ర పురుషుల జట్టులో పి.నగేశ్, కె.లక్ష్మణ్, ఈ ఆనంద్, మహిళల జట్టుకు కె.సౌజన్య ఎంపికయ్యారు. ఆయా క్రీడాకారులను ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాధుల సారంగపాణి, కార్యదర్శి, రాష్ట్ర కోశాధికారి పుట్టా శంకరయ్య, ఖమ్మం డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి అభినందించారు.

దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన సుందరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం, పక్కన నాయకులు

వర్ధంతి సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ముదిగొండ: పేదల హక్కుల కోసం, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ముదిగొండ మండలం చిరుమర్రిలో శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభకు పార్టీ గ్రామ కార్యదర్శి సామినేని రామయ్య అధ్యక్షత వహించారు. ఈ సభలో తమ్మినేని మాట్లాడుతూ పేద ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలన్నీ ఎర్రజెండా పోరాటాలతోనే మొదలయ్యాయని తెలిపారు. ప్రజల కష్టాలు ఉన్నంత వరకు ఎర్రజెండా వారికి అండగా నిలుస్తుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంతో పాటు జిల్లాలో సత్తా చాటి అసెంబ్లీలో అడుగుపెడతామని తమ్మినేని ధీమా వ్యక్తం చేశారు. కాగా, దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈమేరకు సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తొలుత తమ్మినేనికి నాయకులు స్వాగతం పలకగా పుచ్చలపల్లి సుందరయ్య స్తూపాన్ని ఆవిష్కరించారు. అలాగే, వివిధ పార్టీలకు చెందిన పలువురు సీపీఎం చేరగా ఆయన ఆహ్వానించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, మచ్చా లక్ష్మి, బుగ్గవీటి సరళ, బట్టు పురుషోత్తం, రాయల వెంకటేశ్వర్లు, కోలేటి ఉపేందర్ రావు, కోలేటి అరుణ, బండి పద్మ, దామోదర్, కల్యాణ్, రాజు పాల్గొన్నారు.

22న కలెక్టరేట్ల ఎదుట ధర్నా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఖమ్మంసహకారనగర్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల (యూఆర్ఎస్)ల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మినిమం బేసిక్‌పే ఇవ్వడంతో పాటు రెగ్యులర్ చేయాలని, అన్ని రకాల సెలవులు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఆయా డిమాండ్ల సాధనకు ఈ నెల 22న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని కేజీబీవీలు, యూఆర్ఎస్‌ల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ నెల కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. తొలుత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరరావుతో పాటు షేక్ మహబూబ్ అలీ, బుర్రి వెంకన్న, షమీ, రంజాన్, వీవీ రామారావు, శ్రీకాంత్, సురేశ్, బానోత్ రాందాస్, నాగూర్‌వలీ, ఉద్దండు షరీఫ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీపీ ట్రాక్టర్‌లో మొక్కజొన్నల తరలింపు

ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో బోల్తా



బోల్తా కొట్టిన పంచాయతీ ట్రాక్టర్

ఎర్రుపాలెం: ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని కాచారం గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో శుక్రవారం మొక్కజొన్న లోడ్ తీసుకెళ్తుండగా ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద గురువారం రాత్రి బోల్తా కొట్టింది. గ్రామ పంచాయతీ గుమస్తా తన సొంత పని నిమిత్తం ట్రాక్టర్‌ను తీసుకెళ్లడంతో ప్రమాదవశాత్తు బోల్తా పడిందని ప్రచారం జరిగింది. దీంతో అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీఓ జి.శ్రీలక్ష్మి శుక్రవారం గ్రామ పంచాయతీకి వెళ్లి కార్యదర్శి, సర్పంచ్‌ను విచారించారు. ఈ విషయమై ఎంపీఓను వివరణ కోరగా విచారణ నివేదికను అదనపు కలెక్టర్‌కు అందజేశామని, సమగ్ర విచారణ చేస్తామని తెలిపారు.

పూనమ్.. ఇక లేదు

కేసుల ఛేదనలో కీలకపాత్ర పోషించిన పోలీసు జాగిలం



జాగిలానికి సెల్యూట్ చేస్తున్న పోలీసు ఉద్యోగులు

ఖమ్మంక్రైం: పోలీసు శాఖలో 2010వ సంవత్సరం నుంచి విధులు నిర్వర్తిస్తున్న జాగిలం పూనమ్ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. పదమూడేళ్ల పాటు అనేక క్లిష్టమైన కేసులను ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన పూనమ్‌కు ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, ఉద్యోగులు నివాళులర్పించాక పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ జాగిలం 2010లో పోలీస్ శాఖలో చేరగా ప్రాథమిక శిక్షణ సమయంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకంతో పాటు పలు కోర్సుల్లో నాలుగు బంగారు పతకాలు సాధించింది. 2011లో చర్లలో చేపట్టిన కూంబింగ్‌లో నాలుగు మందు పాత్రలను గుర్తించడమే కాక 2014లో భద్రాచలం బస్టాండ్‌లో పేలుడు పదార్థాలను గుర్తించిందని డాగ్ హ్యాండ్లర్ షేక్ పాషా తెలిపారు. ఈ మేరకు పూనమ్ అంత్యక్రియల్లో ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఆర్ఐలు రవి, శ్రీనివాస్, తిరుపతి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కరాటే మాస్టర్ మృతి



శ్రీకాంత్ (ఫైల్)

పెనుబల్లి: మండలంలోని వీఎం.బంజర్‌కు చెందిన కరాటే మాస్టర్ శ్రీకాంత్(35) గుండెపోటుతో మృతి చెందాడు. సత్తుపల్లిలో శుక్రవారం విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చిన ఆయన వీఎం.బంజర్‌లోని ఇంటికి వస్తుండగా గుండెపోటుకు గురై కుప్పకూలాడు. ఇది గమనించిన స్థానికులు ఆయనను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు సీపీఆర్ చేసినా ప్రాణం దక్కలేదు. ఇరవై ఏళ్ల క్రితం వరంగల్ జిల్లా నర్సంపేట నుండి పెనుబల్లికి వచ్చి స్థిరపడిన శ్రీకాంత్ కరాటే స్కూల్ స్థాపించి వందలాది మంది విద్యార్థులకు కరాటే నేర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా కాలు తొలగించాల్సి వచ్చింది. నేలకొండపల్లికి చెందిన చింతల శ్రీను(50) శుక్రవారం మండలంలోని కొత్తకొత్తూరు వద్దకు సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో కోదాడ నుంచి ఖమ్మం వస్తున్న లారీ నేలకొండపల్లిలో యూ టర్న్ తీసుకునే క్రమాన శ్రీనును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన కాలు నుజ్జునుజ్జు కాగా, నేలకొండపల్లి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఆయన కాలిని తొలగించారు.